AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

10-2-2026 (Tuesday) — MAIN EDITION


## కార్ల షోరూమ్‌లో అగ్ని ప్రమాదం




**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని అత్తాపూర్‌లో ఓ కార్ల షో రూమ్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సోమవారం అర్ధ రాత్రి 1:30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. అత్తాపూర్‌లోని పిల్లర్ నంబర్.185 సమీపంలోని సుజుకి షోరూమ్ సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం జరిగింది. స్క్రాప్ గోడౌన్‌లో మంటలు చెలరేగడంతో మూడు కార్లు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెండు ఫైరింజన్‌లతో మంటలు ఆర్పివేశారు. మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో అధికారులు ముందు జాగ్రత్తగా సమీపంలోని కుటుంబాలను ఖాళీ చేయించారు.

## హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాకు అంతరాయం

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం నెలకొననుంది. మరమ్మతుల నేపథ్యంలో 40 గంటల పాటు నీటి సరఫరా ఉండదని జలమండలి అధికారులు తెలిపారు. నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్ 2 లోని కలాబ్‌గూర్, పటాన్‌చెరులో హెచ్‌టీ(హై టెన్షన్) ఎలక్ట్రికల్ ప్యానెల్స్‌ను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయనున్నారు. అలాగే అమీన్‌పూర్ ఎక్స్‌రోడ్ నుంచి మదీనగూడ వరకు పైప్‌లైన్‌లో ఏర్పడిన లీకేజీలను అరికట్టి, అవసరమైన చోట్ల ఎంఎస్ బ్యారెల్‌స్‌ను మార్పిడి చేస్తూ మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఈ పనుల నేపథ్యంలో బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారం రాత్రి 10 గంటల వరకు నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై కేసు



**అక్షరటుడే, సంగారెడ్డి:** కాంగ్రెస్ నేత, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై కేసు నమోదైంది. మంగళవారం ఉదయం సదాశివపేటలోని ఓ హోటల్‌లో వృద్ధులు, పేదలకు ఆయన డబ్బు పంచినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నియమావళిని ఉల్లంఘించినందుకు జగ్గారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సదాశివపేట సీఐ వెంకటేశ్ తెలిపారు.

## మణిపూర్‌లో మళ్లీ అల్లర్లు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మణిపూర్‌లో మళ్లీ అల్లర్లు చెలరేగాయి. ఉఖ్రుల్ జిల్లాలో హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడంతో పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. కొందరు సాయుధ దుండగులు ఇళ్లకు నిప్పంటించారు. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అధికారులు కర్ఫ్యూ విధించి, ఐదు రోజుల పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

## విశాఖ మెట్రోకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్



**అక్షరటుడే, ఢిల్లీ:** విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఢిల్లీ పర్యటనలో సీఎం చంద్రబాబుకు కేంద్ర మంత్రి మనో హర్‌లాల్ ఖట్టర్ ఈ విషయాన్ని చెప్పారు. విశాఖ, విజయవాడలో మెట్రో రైలు ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో విశాఖ మెట్రోకు పచ్చజెండా ఊపినట్లు సీఎంకు కేంద్రమంత్రి తెలిపారు.



## యూఎస్‌తో బంగ్లాదేశ్ ట్రేడ్ డీల్..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు అయ్యాక అన్ని దేశాలపై విధించినట్లుగానే బంగ్లాదేశ్‌పైనా రెసిప్రోకల్ టారిఫ్స్ విధించారు. బంగ్లా నుంచి వచ్చే దిగుమతులపై 37 శాతం సుంకాలు అమలు చేశారు. కొంతకాలానికి ఈ టారిఫ్‌లను 20 శాతానికి కుదించారు. వాణిజ్య ఒప్పందం విషయంలో ఆ దేశాల మధ్య చర్చలు కొనసాగుతూ వస్తున్నాయి. భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడంతో వస్త్ర పరిశ్రమ ఆధారిత ఆర్థికవ్యవస్థ అయిన బంగ్లాదేశ్‌లో కంగారు మొదలైంది. దీంతో దేశంలో ఎన్నికల వేళ భారత్ కంటే తక్కువ టారిఫ్‌లతో ఒప్పందం కుదుర్చుకొనేందుకు యత్నించింది. ఎట్టకేలకు ఆ చర్చలు ఓ కొలిక్కి వచ్చి ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీనిపై ఫిబ్రవరి 9న రెండు దేశాలు సంతకాలు చేశాయి. దీని ప్రకారం బంగ్లాదేశ్ ఉత్పత్తులపై అమెరికా విధించే సుంకాలు 20 శాతం నుంచి 19 శాతానికి తగ్గనున్నాయి.



## మహిళలకు ఆ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళలకు పెద్ద ఉపశమనంగా మారిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని లక్షలాది మహిళలు వినియోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏపీ ఆర్టీసీ మహిళలకు మరో శుభవార్త ప్రకటించింది. ఈ నెల 15న నడిచే ప్రత్యేక బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణం వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

**మున్సిపల్ ఎన్నికల్లో కీలకమైన ప్రచార ఘట్టానికి తెరపడింది. ఇక ఎన్నికల ప్రక్రియ మిగిలింది. ఇందుకోసం అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా.. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం ప్రధాన పార్టీలు తీవ్ర ప్రయత్నాలు చేశాయి. ఒకరిపై ఒకరు విమర్శల దాడి చేసుకున్నారు. ప్రచారం ముగియడంతో సైలెన్స్ పీరియడ్ అమలులో ఉంది. టీవీలు, ఇతర ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా కూడా ఎలాంటి ఎన్నికల ప్రచారం చేయకూడదు. అయితే పార్టీ విజయం కోసం చివరి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక రేపు ఉదయం పోలింగ్ జరుగనుంది. అభ్యర్థుల భవితవ్యం ఓటు చేతిలో ఉంది.** – అక్షరటుడే, హైదరాబాద్



# ఓటరు చేతిలో భవితవ్యం

- రేపే మున్సిపల్ ఎన్నికల పోలింగ్
- ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- హోరాహోరీగా సాగిన ప్రచారం
- విమర్శలు ప్రతివిమర్శల దాడి

ఎన్నికలలో విజయం కోసం ప్రధాన పార్టీలు జోరుగా ప్రచారం నిర్వహించాయి. ఆయా పార్టీల అభ్యర్థులు ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించగా.. ముఖ్య నాయకులు ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు, సభలలో పాల్గొన్నారు. అధికార పార్టీ తరపున సీఎం రేవంత్‌రెడ్డి పలు సభల్లో పాల్గొన్నారు. బీజేపీ, బీఆరఎస్‌ను టార్గెట్ చేసుకుని విమర్శలు గుప్పించారు. అభివృద్ధికి కేంద్రం సహకరించలేదని, పన్నెండేళ్లలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ లు ఏ ఒక్క పథకానికీ అదనపు నిధులు తేలేదని విమర్శించారు. అవినీతి కేసుల్లో కేసీఆర్‌ను కాపాడుతోందని బీజేపీనే అంటూ బీజేపీ, బీఆరఎస్‌లను సయామి కవలలతో పోల్చారు. మున్సిపాలిటీల సమస్యలకు గత ప్రభుత్వ విధానాలే కారణమంటూ బీఆరఎస్‌పై విరుచుకుపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు ఆయా మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

### రేపే పోలింగ్.. 13న కౌంటింగ్..

రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో బుధవారం పోలింగ్ జరగనుంది. మొత్తం 2,996 వార్డుల్లో 12,993 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 123 చోట్ల ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయగా, పోలింగ్ తర్వాత బ్యాలెట్ బాక్సులను చేర్చేందుకు 137 స్ట్రాంగ్ రూమ్‌లు సిద్ధం చేశారు. ఒకే విడతలో జరిగే ఎన్నికల్లో 20 వేల మంది వివిధ విభాగాలకు చెందిన సిబ్బందితోపాటు సుమారు 25వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సిబ్బంది మంగళవారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. మొత్తం 8,195 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.


పలు ఎన్నికల ప్రచార కార్యక్రమాలలో పాల్గొన్న కేటీఆర్, హరీశ్‌రావులు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ప్రస్తుత కాంగ్రెస్ పాలనపై విరుచుకుపడ్డారు. కేసీఆర్‌ను తిట్టడం తప్ప రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి చేసిందేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు మున్సిపల్ ఎన్నికలలో బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలను రెచ్చగొట్టే నిజమైన మతతత్వ పార్టీ కాంగ్రెస్ అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లు రాష్ట్రానికి పట్టిన రాహు, కేతువులంటూ ధ్వజమెత్తారు. ధర్మపురి అర్వింద్, బండి సంజయ్ తదితరులు కూడా కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి విధానాలను ఎండగట్టారు.



## అమిత్‌షాతో చంద్రబాబు భేటీ..

**అక్షరటుడే, ఢిల్లీ:** కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత వ్యవహారంపై ఆయనతో చర్చించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో.. దానికి సంబంధించిన అంశాలపై చర్చలు జరిపినట్లు సమాచారం. బడ్జెట్ రెండో దశ సమావేశాల్లో బిల్లు పెట్టాలని అమిత్‌షాను సీఎం కోరినట్లు సమాచారం. దీంతో పాటు రాష్ట్రానికి చెందిన మరికొన్ని అంశాలపైనా కేంద్ర హోంమంత్రితో సీఎం చంద్రబాబు చర్చించినట్లు తెలుస్తోంది.

## మున్సిపాలిటీల్లో అధ్వానంగా ప్రభుత్వ పాఠశాలలు : కవిత




**అక్షరటుడే, హైదరాబాద్:** మున్సిపాలిటీల్లో ప్రభుత్వ పాఠశాలలు అధ్వానంగా మారాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి కార్యాలయంలో కవిత మంగళవారం మున్సిపల్ ఎన్నికలపై మీడియాతో మాట్లాడారు. సర్పంచ్ ఎన్నికల్లా మున్సిపల్ ఎన్నికలు సైతం పార్టీ గుర్తులు లేకుండా జరిగితే బాగుంటుందన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార శైలిపై ఆమె విమర్శలు చేశారు. అన్ని పార్టీలు అసలు సమస్యలను పక్కన పెట్టి ప్రజల దృష్టిని మరల్చే యత్నం చేశాయన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు ప్రచారం కోసం మహబూబ్‌నగర్ వచ్చారని చెప్పారు. అయితే అక్కడ ఇప్పటికి తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాని గురించి ఎవరు మాట్లాడడం లేదన్నారు. పట్టణాల్లోని బస్తీ దవాఖానాల్లో కనీస వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని కవిత చెప్పారు. పట్టణాల్లో గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకుపోయిందన్నారు. మంచి వాళ్లను ఎన్నుకోవాలని కవిత కోరారు. సింహం గుర్తుపై పోటీ చేస్తున్న తమ అభ్యర్థులను గెలిపించాలన్నారు.

## 25వేల మందితో బందోబస్తు


**అక్షరటుడే, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల కోసం ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. 25 వేల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికలపై ఏర్పాట్లపై డీజీపీ శివధర్ రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో 25 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్లు డీజీపీ వెల్లడించారు. ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయి. వీటి కోసం 8,189 పోలింగ్ కేంద్రాలు, 133 కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు విని యోగించుకోవాలని కోరారు.

## రూ.700 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా..



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** హైదరాబాద్ నగరంలోని ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ స్థలాలు, పార్కులు, రోడ్లను కబ్జా చెరల నుంచి విడిపిస్తోంది. నగరంలోని కొండాపూర్‌లో రూ.700 కోట్ల విలువైన భూమిని మంగళవారం హైడ్రా కాపాడింది. కొండాపూర్‌లోని శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం మదీనగూడ మార్గంలో జంగమోని కుంట ఉంది. ఈ కుంటను కొందరు కబ్జా చేశారు. మట్టి పోసి 4 ఎకరాలను ప్లాట్లుగా మార్చారు. వాటిని విక్రయించేందుకు యత్నించారు. అయితే జంగమోని కుంట ఆక్రమణలపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో హైడ్రా సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టారు. ఆక్రమణలు నిజమేనని తేలడంతో మంగళవారం ఉదయం వాటిని తొలగించారు. అనంతరం కుంట చుట్టూ ఫెన్సింగ్ వేశారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## సంగీత్ శోభన్ సరసన.. అనస్వర రాజన్



**మలయాళ ముద్దుగుమ్మ అనస్వర రాజన్ టాలీవుడ్‌లో తన హవా కొనసాగిస్తోంది. ‘ఛాంపియన్’ సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన ఈ భామ, తొలి ప్రాజెక్ట్‌తోనే బాక్సాఫీస్ వద్ద హిట్ అందుకుంది. తన సహజ నటన, అందంతో కుర్రాళ్ల మనసు దోచుకున్న అనస్వర.. ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారి వరుస అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. తాజా సమాచారం ప్రకారం.. యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో సంగీత్ శోభన్ సరసన నటించేందుకు అనస్వర గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ‘కుమారి 21F’ వంటి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను అందించిన దర్శకుడు సూర్య ప్రతాప్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు.**

–అక్షరటుడే, సినిమా డెస్క్

## లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసులు ఇచ్చాయి. లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌కు కాంగ్రెస్ ఎంపీలు మహమ్మద్ జావెద్ కె.సురేశ్ నోటీసు అందజేశారు. లోక్‌సభలో ఇటీవల రాహుల్‌గాంధీని మాట్లాడనివ్వకపోవడంపై విపక్షాలు ఆగ్రహంతో ఉన్నాయి. ఈ మేరకు ఆయనపై అవిశ్వాసం పెట్టాలని సోమవారమే నిర్ణయించాయి. తీర్మానం నోటీస్‌పై 118 మంది ఎంపీలు సంతకం చేశారు. రూల్ 94సీ కింద మంగళవారం నోటీసు ఇచ్చినట్లు ఎంపీ గౌరవ్ గొగోయ్ తెలిపారు. ప్రతిపక్ష సభ్యుల నిరసనలు, నినాదాలతో మంగళవారం సైతం సభ వాయిదా పడింది. సభ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ఎంపీలు సోమవారం అవిశ్వాస తీర్మానంపై సంతకం చేసినట్లు సమాచారం.